

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



3 జనగామ

శనివారం 10 ఫిబ్రవరి 2024





పులకించిన పుట్టి పెరిగిన నేల

మన పీవీ.. ఇక భారతరత్నం..

- మరణానంతరం 20 ఏళ్లకు దక్కిన గౌరవం
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు
- బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు
- అంచెలంచెలుగా ప్రధాని స్థాయికి ఎదిగిన పీవీ

వరంగల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : లక్నేపల్లి గడ్డపై పుట్టి. వంగర నేలపై పెరిగిన మన పీవీ నర్సింహరావుకు భారతరత్న పురస్కారం లభించింది. ఈ మేరకు గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్విట్టర్ ఎక్స్‌లో పీవీకి భారతరత్న పురస్కారంపై పోస్టు చేశారు. మారుమూల ప్రాంతంలో పుట్టిన పీవీ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నను పొందటంతో ఓరుగల్లు ప్రజల్లో హర్షం వ్యక్తంఅవుతోంది. రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడు, సంస్కరణలకు ఆద్యుడుగా పిలిచే పీవీ నర్సింహరావు.. తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని భారతరత్నంగా నిలిచారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టి.. ప్రధానిగా పార్లమెంట్‌లో నిలిచి తెలుగు తేజస్సును దశదిశలా చాటిన మహోన్నత వ్యక్తి.

లక్నేపల్లిలో పుట్టి... వంగరలో పెరిగి..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28వ తేదీన రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పీవీ నర్సింహరావు జన్మించారు. ఇదే ప్రాంతంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. అయితే ఐదేళ్లకే అప్పటి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత హనుమకొండ జిల్లా) భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మ దంపతులు పీవీని దత్తత తీసుకున్నారు. అప్పటి నుంచి పాములపర్తి వెంకట నర్సింహరావుగా మారారు. హుజూరాబాద్‌లో పాఠశాల, హనుమకొండలో కళాశాల విద్యను పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ చదువు తుండగానే నిజాం సర్కారుకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో కాంగ్రెస్ నేతలతో పాల్గొన్నారు. 1938లో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నిజాం ప్రభుత్వం నిషేధించిన వందేమాతరం గేయాన్ని పాడటంతో యూనివర్సిటీ నుంచి పీవీని బహిష్కరించారు. ఆ తరువాత నాగపూర్‌లోని ఓ మిత్రుడి సహాయంతో 1940 నుంచి 1944 వరకు ఎల్ఎల్‌బీ చదివారు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన పీవీ.. కాకతీయ పత్రికను స్థాపించి జయ అనే మా రుపేరుతో వ్యాసాలు రాస్తూ నిజాంపై పోరాటాన్ని కొనసాగించారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల కృష్ణారావుల అనుచరుడిగా స్వాతంత్ర్యోద్యమంలో పీవీ పాల్గొన్నారు. 1951లో ఏఐసీసీ సభ్యుడిగా పీవీ పదవి లభించింది. కాగా, పీవీ నర్సింహరావు సతీమణి సత్యమ్మరావు 1970 జూలై 1న మృతి చెందారు. వీరికి ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో మాజీ మంత్రి పీవీ రంగారావు పెద్ద కుమారుడు కాగా, సికింద్రాబాద్ మాజీ ఎంపీ పీవీ రాజేశ్వర్‌రావు, పీవీ ప్రభాకర్‌రావులు ఉన్నారు. పీవీ కుమార్తెల్లో ఒకరైన వాణిదేవి పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధించారు.

రాజకీయ ప్రస్థానం

కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గంలో 1957 నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1962లో రెండోసారి విజయం సాధించిన తరువాత మంత్రిగా అవకాశంవచ్చింది. 1962 నుంచి 1971 వరకు వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. 1971లో సెప్టెంబరు 30న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్లు ఆ పదవిలో కొనసాగిన పీవీ.. అనూహ్య రీతిలో సీఎం పదవిని కోల్పోయారు. ఆ తరువాత రాష్ట్ర రాజకీయాలకు గుడ్‌బై చెప్పి జాతీయ రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. రాష్ట్ర రాజకీయాలకు కరీంనగర్ అండగా నిలబడితే జాతీయ రాజకీయాల్లో మాత్రం వరంగల్ జిల్లా నిలపెట్టింది. తొలిసారి 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హనుమకొండ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తరువాత వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో 1980లో మరోసారి పోటీచే సిన పీవీ రెండోసారి కూడా విజయం సాధించారు. 1980-84 మధ్యకాలంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత 1984లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో హనుమకొండ నుంచి మూడోసారి పోటీ చేసిన పీవీ.. బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి చేతిలో ఓడిపోయారు. అయితే 1984లోనే మరోస్థానం మహ రాష్ట్రలోని రామ్‌టెక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కూడా పోటీ చేసి విజయం సాధించారు. 1984 నవంబరు నుంచి 1985 ఫిబ్రవరి వరకు భారత ప్రణాళిక శాఖ మంత్రిగా, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1985-1989 మధ్యకాలంలో కేంద్ర రక్షణ మంత్రిగా, కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రిగా, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగా పీవీ పనిచేశారు. 1989లో నాలుగోసారి రామ్‌టెక్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 1991లో అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ హత్యకు గురైన తరువాత పీవీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1991-96 మధ్య కాలంలో ఏఐసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. అదే సమయంలో ప్రధానమంత్రిగా కూడా పీవీ నర్సింహరావు బాధ్యతలు చేపట్టారు. 1991 జూన్ నుంచి 1996 మే 10వ తేదీ వరకు కొనసాగారు. ఐదేళ్ల పాటు మైనారిటీ ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపిన ఘనత పీవీదే.

> "రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడు పీవీ నర్సింహరావు ఈ దేశానికి అందించిన సేవలు అపారం..' ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా అయన చేసిన సేవలు చిరస్మరణీయం. దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో ఆయన నాయకత్వం బలమైన పునాది వేసింది. పీవీ హయాంలో ప్రపంచ మార్కెట్‌ను భారత్ ఆకర్షించింది. ఆయన పాలనలో ఆర్థిక వృద్ధికి కొత్త శకం మొదలైంది. విదేశాంగ విధానం, విద్యారంగంలో ఆయన అందించిన సహకారం దేశాన్ని సాంస్కృతంగా, మేధోపరంగా దేశాన్ని సుసంపన్నం చేసింది."
>
> - ట్విటర్ ఎక్స్‌లో ప్రధాని మోదీ



వంగర, లక్నేపల్లిలో సంబరాలు 5

నిధులు గలగల పారేనా?



- రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసుల ఆశలు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు కేటాయింపుపై సందిగ్ధం
- హెల్త్‌సిటీకి నిధులు అనుమానమే?
- మామునూరు ఎయిర్‌పోర్టుకు నిధులపై ఆశలు
- మేడారం జాతరకు వరాలు ప్రకటించే అవకాశం
- నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సీఎం

తెలంగాణ బడ్జెట్-2024



హనుమకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో శనివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు కేటాయిస్తోందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలలోని పలు సమస్యల శాశ్వత పరిష్కారానికి, సమగ్రాభివృద్ధికి చేపట్టవలసిన పనులు, అర్థాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు కార్యరూపం ఇవ్వాలంటే ప్రభుత్వం బడ్జెట్‌లో చాలినన్ని నిధులను కేటాయించాల్సిన అవసరం ఉన్నది. ఈదృష్ట్యా బడ్జెట్‌లో కేటాయింపులు ఎలా ఉంటాయన్న చర్చ జరుగుతోంది.

కాళేశ్వరం నిధులు..?

భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాళేశ్వరం ప్రాజెక్టు వివాదంలో చిక్కుకున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు ఈసారి ప్రభుత్వం ఏ మేరకు నిధులు కేటాయిస్తుందన్న విషయంలో సందిగ్ధం నెలకొన్నది. గత బీఆర్ఎస్ సంవత్సరం ఈ ప్రాజెక్టు నిర్వహణకు పెద్దగా నిధులు కేటాయించలేదు. కాళేశ్వరం టూరిజం సర్క్యూట్ కోసం మాత్రం రూ.750 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. కానీ ఒక్కపైసా కూడా విడుదల కాలేదు. కొత్త ప్రభుత్వం ఈ టూరిజం సర్క్యూట్ ప్రాజెక్టును కొనసాగిస్తుందా? నిధులు కేటాయిస్తుందా? అన్నదానిపై సందిగ్ధం నెలకొన్నది. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని దేవాదుల, శ్రీ రాంసాగర్ తదితర ప్రాజెక్టులకు ఏ మేరకు బడ్జెట్‌లో పద్దులుంటాయోనన్న చర్చ జరుగుతోంది.

మెగా టెక్స్‌టైల్ పార్క్

గీసుగొండ, శాయంపేట మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులు కుంటినడక నడుస్తున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరతను ఎదుర్కొంటోంది. ఈ బడ్జెట్‌లో ఏ మేరకు నిధుల కేటాయింపు జరుగుతుందో చూడాలి. గత బడ్జెట్‌లో ప్రాతిపదిక సదుపాయల కల్పనకు రూ.160కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయింపు జరగవచ్చునని ప్రజలు ఆశిస్తున్నారు.

హెల్త్ సిటీ

వరంగల్ పాత సెంట్రల్ జైలు స్థలంలో హెల్త్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి కూడా ఏమేరకు నిధుల కేటాయింపు జరుగుతుందో చూడాలి. గత ప్రభుత్వం రూ. 1100 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన విషయంలో కూడా వివాదం తలెత్తింది. ఈ ఆస్పత్రి స్థలాన్ని గత ప్రభుత్వం బ్యాంకులో కుదువబెట్టి రూ.2వేల కోట్లు తీసుకున్నదని, పైగా ఆస్పత్రి పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ప్రభుత్వం విమర్శిస్తోంది. ఈ పరిస్థితుల్లో దీనికి బడ్జెట్‌లో ప్రభుత్వం ఏ మేర కు నిధులు ఇస్తుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అలాగే మామునూరు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయనున్నట్టు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి

మిగతా 4వ పేజీలో..

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ శివలింగయ్య



దరఖాస్తుదారుడి ఇంటి వద్ద డేటాఎంట్రీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ శివలింగయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 9 : రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా త్వరలో అమలు పర్చనున్న గ్యాస్ సబ్సిడీ విషయంలో ప్రజాపాలన దరఖాస్తు పత్రాల ఆధారంగా నిర్వహిస్తున్న సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. సర్వేను పూర్తి చేసి ఆయా వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఓ ఇంటి వద్దకు కలెక్టర్ నేరుగా వెళ్లి బీఎల్‌వో చేపడుతున్న సర్వే వివరాలను యాప్‌లో నమోదు చేయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్యాస్ సబ్సిడీ పథకం అమలును చేపట్టడానికిగాను కొందరు లబ్ధిదారులు కన్స్యూమర్ నెంబర్లు వేయడంలో తప్పిదాలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని నివారించడానికి గ్రామాల వారిగా బీఎల్‌వోలతో ప్రతీ ఇంటికి వెళ్లి కన్స్యూమర్ నెంబర్‌ను తీసుకొని వెంటనే సంబంధిత యాప్‌లో ఎంట్రీ చేస్తారని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేశ్, ఆర్డీవో వాసం రామ్మూర్తి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ అర్జున్, ఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డేటాఎంట్రీపై అలసత్వం వహిస్తే చర్యలు

చిలుపూర్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న మహాలక్ష్మి పథకానికి సంబంధించి గ్రామాల్లో చేపడుతున్న గ్యాస్ కనెక్షన్ నంబర్ల డేటాఎంట్రీ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్న క్లస్టర్ అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ శివలింగయ్య హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని చిన్నపెండ్యాల గ్రామాన్ని సందర్శించి డేటాఎంట్రీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో లబ్ధిదారుల గ్యాస్ కనెక్షన్ నంబర్లలో దొర్లిన తప్పులకు సంబంధించి చోటు చేసుకున్న పరిణామాలు, సవరణల విషయమై చేపడుతున్న డేటా సవరణల విషయమై ఎంపీడీవో పులుగు వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సరస్వతిని అడిగి తెలుసుకున్నారు. వారికి డేటాఎంట్రీపై అవగాహన లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివలింగయ్య మాట్లాడారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్‌కుమార్, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వాసం రామ్మూర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కోర్నేలియస్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, తాళ్ళపల్లి సమ్మయ్య, పంచాయతీ సెక్రటరీ శశిధర్ రెడ్డి, రాధిక, కవిత, ఇల్లందుల సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కాలువ పనులు పూర్తి చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఘన్‌పూర్-నవాబుపేట కాలువ పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 9 : స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్ఎస్ దేవాదుల రిజర్వాయర్ నుంచి లింగాలఘణపురం మండలంలోని నవాబుపేట రిజర్వాయర్ వద్దకు వెళ్లే ప్రధాన కాలువ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పనులు పూర్తిచేసే వరకు అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఆర్ఎస్ రిజర్వాయర్ కాలువ వద్ద నుంచి బొలేరో వాహనంలో కడియం నేరుగా పర్యటించి కాలువను పరిశీలించారు. ఘన్‌పూర్, విశ్వనాథపురం, చంద్రు తండా, ఇప్పగూడెం, అక్కపల్లిగూడెం, బోయినిగూడెం, కోమటిగూడెం, రఘునాథపల్లి మండలంలోని కంచనపల్లి, శ్రీమన్నారాయణపురం, నవాబుపేట వరకు కాలువ వెంట సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామాల వారిగా రైతుల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. అనంతరం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘన్‌పూర్ నుంచి నవాబుపేట వరకు ఉన్న కాలువ పూర్తిగా అధ్వానంగా ఉందని అన్నారు. ఉప కాలువల పరిస్థితి మరీ దారుణంగా ఉందని తెలిపారు. కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యం వలన పంట పొలాలకు సాగునీరు అందే పరిస్థితి లేదన్నారు.



దేవాదుల కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఈ ప్రాంతం కరువుతో తల్లడిల్లుతుందని గ్రహించి 2003లో దేవాదుల పథకానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే శ్రీహరి తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించి దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రస్తుతం రూ.13,461 కోట్లు అవుతాయని అంచనా వేయడం జరిగిందన్నారు. 7 మండలాల పరిధిలో లక్షకు పైగా ఎకరాలకు సాగునీరు అందుతుందని రూపకల్పన చేసినట్లు చెప్పారు. నవాబుపేటకు వెళ్లే కాలువ కింద పాలకుర్తి, రఘునాథపల్లి, లింగాలఘణపురం పరిధిలో 54వేల ఎకరాల ఆయకట్టుకు, నవాబుపేట రిజర్వాయర్ కింద 53వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. కానీ ఘన్‌పూర్ ఆర్ఎస్ ప్రధాన కాలువ నుంచి నవాబుపేట రిజర్వాయర్‌కు నీళ్లు వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఘన్‌పూర్, అశ్వరావుపల్లి, నవాబుపేట రిజర్వాయర్ల కట్ట అడవిని తలపించేలా ఉందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కాలువల మరమ్మతులు పూర్తి చేయాలని, రిజర్వాయర్ల కట్టలపై ఉన్న చెట్లను తొలగించాలని కోరారు. తూములు, షట్టర్లు ఏర్పాటు చేయించాలన్నారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో నీటిపారుదల శాఖపై చర్చ ఉండేట్లు లేదని కడియం పేర్కొన్నారు. త్వరలోనే కలెక్టరేట్‌లో నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, మారుజోడు రాంబాబు, బూర్ల శంకర్, ఎంపీపీ కందుల రేఖ, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు గన్ను నర్సింహులు, బెల్లపు వెంకటస్వామి, మునిగెల రాజు, నాయకులు కొంతం శ్రీనివాస్, జీడి రమేష్, చింత జాకబ్, మాచర్ల కుమారస్వామి, కిషన్‌రాజ్, చింతల్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధిపైనే జాతి భవిష్యత్



మాట్లాడుతున్న జాతీయ పోషకాహార సంస్థ డైరెక్టర్ శశికిరణ్

జాతీయ పోషకాహార సంస్థ డైరెక్టర్ శశికిరణ్

పట్టణంలో చెకుముకి రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 9 : శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి ద్వారా మాత్రమే జాతి భవిష్యత్ ఆధారపడుతుందని జాతీయ పోషకాహార సంస్థ డైరెక్టర్ శశికిరణ్ అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో శుక్రవారం జన విజ్ఞాన వేదిక(జేవీవీ)ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలు ప్రారంభమయ్యాయి. దీనికి జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వర్‌రావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా శశికిరణ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పరచుకోవాలని, నేర్చుకున్న విషయాలను నిత్య జీవితంలో అనుసరించాలని అన్నారు. డీసీపీ సీతారాం మాట్లాడుతూ జేవీవీ సమాజంలో మూఢ విశ్వాసాల నిర్మూలన కోసం విశేష కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర స్థాయిలో పోటీలు జనగామలో నిర్వహించడం ఆనందకరమన్నారు. డీఈవో కె.రాము మాట్లాడుతూ పిల్లల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడానికి ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు నిరంతరం శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా మెజీషియన్ చంద్రయ్య ఇసుకలో నీళ్లు పోయడం ద్వారా జ్యోతి వెలిగించి ఆశ్చర్యపరిచారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాచర్ల భిక్షపతి, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, మల్లారెడ్డి, రవీందర్, ప్రొఫెసర్ రాంచంద్రయ్య, ప్రొఫెసర్ బి.వి.రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రఘునందన్, శ్రీనివాసరావు, రాజా, చంద్రశేఖర్‌రావు, బాలరాజు, లక్ష్మణ్, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో బైక్ రైడింగ్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలు జనగామలో నిర్వహిస్తుండగా పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ మేరకు పట్టణంలో కళ్లకు గంతలతో బైక్ రైడింగ్ పలువురిని ఆశ్చర్య పరిచింది. మాయా లేదు... మంత్రం లేదు... ఉన్నదంతా సైన్స్ అని తెలియజేసేలా జేవీవీ నాయకుడు కూర్మయ్య పట్టణంలోని జనసమ్మర్థం కలిగిన రోడ్డుపై కళ్లకు గంతలు కట్టుకొని బైక్ రైడింగ్ చేయడంతో చూపరులు ఆశ్చర్య చకితులయ్యారు.

ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు ఇవ్వాలి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే పల్లా



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆటో కార్మికులకు నెలకు రూ.10 వేల చొప్పున అందించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆరున్నర లక్షల మంది ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఈఎంఐలు కట్టలేక ఉపాధి లేక 21 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. చనిపోయిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల రుణాలు మాఫీ చేయాలన్నారు. బస్సు లు సరిపడా లేక మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నా రని, వెంటనే బస్సుల సంఖ్యను పెంచాలన్నారు.

పీవీకి భారతరత్న దక్కడం గర్వకారణం

తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి పీవీ నరసింహారావుకు భారతరత్న దక్కడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి తెలంగాణకే తలమానికంగా నిలిచి వివిధ రంగాల్లో కృషి చేసిన భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారత రత్న పురస్కారం ప్రకటించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పలుమార్లు కేంద్రాన్ని కోరారని అన్నారు.


సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ టీఎస్ లక్ష్యం

జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి




పట్టణంలో జెండావిష్కరణలో పాల్గొన్న పీఆర్‌టీయూ టీఎస్ ప్రతినిధులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 9 : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ టీఎస్ లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్‌రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలో జెండావిష్కరణ చేశారు. అనంతరం సంఘం వ్యవస్థాపకులు సామల యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించగా మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 52 సంవత్సరాలుగా పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుందన్నారు. సంఘం ఎల్లప్పుడు ఉపాధ్యాయుల పక్షమే వహిస్తుందన్నారు. అనంతరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ హితపరులు, సంఘానికి విశిష్ట సేవలందించిన విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఇందులో ఎం.భాగ్యవతి, మహేందర్‌రెడ్డి, హరిబాబు, విఠల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు నారాయణ, అబ్దుల్ హఫీజ్ ఉన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ మాస పత్రిక సంపాదక సభ్యులు పసునూరి సోమరాజు, బి.సంతోష్‌కుమార్, ఇ.సంతోష్‌కుమార్, బి.శ్రీనివాస్, ఎండి.జలీల్, అంబటి అంజయ్య, వాంకుడోతు బీకోజీ తదితరులు పాల్గొన్నారు.







నిధులు గలగల పారేనా?

(3వ పేజీ తరువాయి)

ప్రకటించారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో ఎయిర్‌పోర్టుకు నిధుల కేటాయింపు జరగవచ్చునని భావిస్తున్నారు.

నగరాభివృద్ధి

వరంగల్ నగరాభివృద్ధికి బడ్జెట్‌లో చాలినన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉన్నది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ఔటర్ రింగ్ రోడ్డు పనుల పూర్తికి నిధులేమైనా బడ్జెట్‌లో కేటాయింపు జరుగుతుందా? నిధుల లేమి వల్ల కాళోజీ కళాక్షేత్రం పనులు పదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. రూ. 50 కోట్లతో చేపట్టి ఈ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. అంచనా వ్యయంతో రూ.100కోట్లకు పెరిగింది. కళాక్షేత్రాన్ని పూర్తి చేయడానికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

మెగా లెదర్ పార్క్


జనగామ జిల్లా పరిధిలోని మెగా లెదర్ పార్క్ ఏర్పాటు చేస్తామని 2016లో అసెంబ్లీ సాక్షిగా కేటీఆర్ ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు సాకారం కాలేదు. ఈ పార్క్ ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ దృష్ట్యా ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగవచ్చునని జనగామ జిల్లా వాసులు ఆశపడుతున్నారు. కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్ దేవరుప్పుల, నష్కల్‌లో ఫుడ్ ప్రాజెసింగ్ జోన్ల ఏర్పాటు విషయమై బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్నారు.

బయ్యారం ఉక్కు

గత బడ్జెట్‌లో మహబూబాబాద్ జిల్లాకు కేసీఆర్ ప్రభుత్వం మొండి చేయిచూపింది. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం సాగుతోంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవలే ఢిల్లీలో ఈ విషయమై సంబంధిత కేంద్ర మంత్రులతో చర్చించింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ప్రాథమిక పనులకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా శనివారం నాటి బడ్జెట్‌లో నిధుల ప్రస్తావన ఉండొచ్చని ఆశిస్తున్నారు. మల్యాలలో కృషి విజ్ఞాన కేంద్రం జెన్నారెడ్డి వెంకట్‌రెడ్డి స్మారక ఉద్యానవన ఫల పరిశోధన కేంద్రానికి అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కోసం నిధుల ప్రకటనను జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

మేడారం జాతర

సీఎం రేవంత్ రెడ్డికి మేడారం సమ్మక్క సారలమ్మ జాతరతో సెంటిమెంట్ ఉంది. కిందటేడు పాదయాత్రను ఇక్కడి నుంచే మొదలు పెట్టారు. ముఖ్యమంత్రిగా పదవిని అధిష్టించారు. ఈ క్రమంలో ఈ సారి జాతరకు రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేడారం జాతరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల ప్రకటన ఏమైనా ఉంటుందా? అని ములుగు జిల్లా వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జాతరను జాతీయ పండుగ హోదాను కల్పించడంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే విషయమై బడ్జెట్‌లో ప్రస్తావన ఉంటుందా? అని చర్చించుకుంటున్నారు.







దిక్సూచి DIKSUCHI

మౌలానా ఆజాద్ వర్సిటీలో పార్ట్ టైమ్ పీహెచ్‌డీ



హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ) - పార్ట్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్ 2023-24 వింటర్ సెషన్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్పాన్సర్డ్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీర్‌లు, సైంటిస్ట్‌లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, మేనేజీరియల్ స్టాఫ్, స్టార్టప్ ప్రమోటర్స్, అకడమిక్ అడ్మినిస్ట్రేటర్లు, టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్(ఆర్‌ఏటీ), డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయవచ్చు. స్కాలర్‌షిప్ సౌకర్యం లేదు.

విభాగాలు-సీట్లు: మేనేజ్‌మెంట్ విభాగాల్లో 9, కామర్స్ విభాగాల్లో 6, సైన్సెస్ విభాగాల్లో 21, టెక్నాలజీ విభాగాల్లో 4, ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ విభాగాల్లో 38, దక్కన్ స్టడీస్ విభాగాల్లో 5, సోషల్ సైన్సెస్ విభాగాల్లో 15, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగాల్లో 7 సీట్లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దు ఒక సబ్జెక్ట్‌గాగానీ లేదా ఉర్దూ మీడియంలోగానీ చదివి ఉండాలి. లేదా మదర్సా కోర్సు పూర్తిచేసి ఉండాలి. ఉర్దూ భాషకు సంబంధించి ఎటువంటి అర్హత లేనివారు థీసిస్ సబ్మిషన్ నాటికి వర్సిటీ అందించే రెండు క్రెడిట్ల ఉర్దూ కోర్సు పూర్తిచేయాల్సి ఉంటుంది.

- విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. వర్సిటీ నిర్వహించే రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి. యూజీసీ/సీఎస్ఐఆర్/ ఇన్‌స్పయిర్/ఐకార్/ఐసీహెచ్‌ఆర్/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్ లేదా రాజీవ్ గాంధీ ఫెలోషిప్ అవార్డ్/టీచర్ ఫెలోషిప్ పొందినవారు; నెట్/సెట్/స్లెట్/జీప్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఎంఫిల్ అభ్యర్థులు ఆర్ఏటీ రాయనవసరం లేదు. దరఖాస్తు నాటికి సంబంధిత రంగంలో మూడేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

వెయిటేజీ: యూజీసీ/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి, స్పాన్సర్డ్ అభ్యర్థులకు, రీసెర్చ్ సంస్థల్లో సైంటిస్ట్‌లకు 70 మార్కులు; నెట్/సెట్/స్లెట్/గేట్/ జీప్యాట్ అర్హత ఉన్నవారికి, ఇన్‌స్పయిర్/రాజీవ్ గాంధీ తదితర ఫెలోషిప్‌లు ఉన్నవారికి 60 మార్కులు; ఎంఫిల్ అభ్యర్థులకు 50 మార్కుల వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 18
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 28 నుంచి
- **రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** మార్చి 8
- **ఫైనల్ కీ విడుదల:** మార్చి 12
- **ఫలితాలు విడుదల:** మార్చి 15
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** మార్చి 18, 19
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మార్చి 22
- **ఇంటర్వ్యూలు:** మార్చి 27, 28
- **అడ్మిషన్స్:** ఏప్రిల్ 3, 4
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఏప్రిల్ 15 నుంచి
- **వెబ్‌సైట్:** manuu.edu.in

ఐఐపీఈలో షార్ట్ కోర్సు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)కి చెందిన హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్(హెచ్&ఎస్) విభాగం- 'అప్లికేషన్స్ ఆఫ్ స్కాలర్ హైపర్‌బోలిక్ కన్జర్వేషన్ లాస్' అంశానికి సంబంధించి షార్ట్ కోర్సును అందిస్తోంది. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కోర్సు వ్యవధి అయిదు రోజులు. డిగ్రీ/పీజీ చేస్తున్న అభ్యర్థులు, రీసెర్చ్ స్కాలర్స్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోస్, మేథమెటిక్స్/సంబంధిత విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందులో పార్టిసిపేట్ చేసినవారందరికి ఈ-సర్టిఫికెట్లు ఇస్తారు.

- **కోర్సు తేదీలు:** మార్చి 1 నుంచి 5 వరకు
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** డిగ్రీ/పీజీ విద్యార్థులకు రూ.354; రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.590; పోస్ట్ డాక్టోరల్ ఫెలో/ఫ్యాకల్టీ మెంబర్లకు రూ.1180
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TfRqOkFలో చదవండి.

నాగార్జున వర్సిటీలో డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(సీడీఈ)- దూరవిద్య కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిగ్రీ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. ఏడాదికి రెండు చొప్పున ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఏని తెలుగు మాధ్యమంలో; బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీబీఏ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; బీకాం(జనరల్) కోర్సుని రెండు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- బీఏ సబ్జెక్టులు ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్.

పీజీ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: ఇంగ్లీష్, తెలుగు, సంస్కృతం, హిందీ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్

ఎంకాం స్పెషలైజేషన్‌లు: అకౌంటెన్సీ, బ్యాంకింగ్

లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ కోర్సులు: బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

డిప్లొమా: కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో అందుబాటులో ఉంది. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

- స్పెషలైజేషన్‌లు: ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్

సర్టిఫికెట్ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి ఏడాది. వీటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్
- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ హెచ్ఐవీ ఎయిడ్స్ కౌన్సెలింగ్.

ముఖ్య సమాచారం


- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** www.anucde.info

నవ్య | చిత్రజ్యోతి



పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా చిరంజీవిని తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ సత్కరించారు. చిరంజీవి, సురేఖ దంపతులు శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. చిరంజీవికి ప్రతిష్ఠాత్మకమైన పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించడం పట్ల సౌందరరాజన్ హర్షం వ్యక్తం చేశారు. కోట్లాది ప్రేక్షక హృదయాలను గెలుచుకున్నారని ఆమె చిరంజీవిని అభినందించారు.

కాంబినేషన్ కుదిరింది





విభిన్న కథలు, సరికొత్త గెటప్పులతో ప్రేక్షకులను మెప్పించడం తమిళ హీరో విక్రమ్ పంథా. ఆయన కథానాయకుడిగా ఎస్ యూ అరుణ్ కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'చియాన్ 62' వర్కింగ్ టైటిల్. ఇందులో విక్రమ్ ఎలాంటి పాత్ర చేయబోతున్నారనేది ప్రస్తుతానికి సస్పెన్స్. తాజాగా చిత్రబృందం స్పెషల్ అప్‌డేట్‌ను వదిలింది. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మరో స్టార్ యాక్టర్ ఎస్ జే సూర్య భాగమవుతున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. ఈ చిత్రంలో సూర్య మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో కనిపిస్తారని యూనిట్ తెలిపింది. రియా శిబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

నేనూ ప్రేమలో పడ్డా



సుబ్బు, శ్రీవల్లి, కిట్టయ్య ప్రధాన పాత్రలు పోషించిన 'ఐ హేట్ లవ్' చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. 'నేనూ ప్రేమలో పడ్డా' అనేది ఉప శీర్షిక. వెంకటేశ్ రవి దర్శకత్వంలో డాక్టర్ బాల రవి ఈ సినిమాను నిర్మించారు. చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు వీరశంకర్ ఆవిష్కరించారు. సినిమా కో ప్రొడ్యూసర్ పాలగుమ్మి వెంకట కృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మంచి చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. అలాగే మా సినిమా కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. దర్శకుడు వెంకటేశ్ మాట్లాడుతూ 'కోనసీమ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. యూత్‌ను ఆకట్టుకొనే సందేశాత్మక చిత్రం ఇది' అని చెప్పారు. ఈ చిత్రానికి అంగర శివ సాయి గౌడ ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

ఏదో ఏదో మాయ



గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. ఏ హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. మార్చి 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మ్యూజిక్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. శుక్రవారం 'ఏదో ఏదో మాయ' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేసింది. రవి బస్రూర్ స్వరపరిచిన ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: స్వామి జె గౌడ. ఎడిటర్: తమ్మిరాజు

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం...ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/eXnCM8Wలో చదవండి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0UvYLxHలో చదవండి.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 97 శాతం విద్యార్థుల హాజరు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 9 : జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం సెషన్‌లో జనరల్, ఒకేషనల్ విద్యార్థులతో కలిపి 256 మందికి గాను 252 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 199 మంది విద్యార్థులకు 193 మంది హాజరయ్యారు. మొత్తం 455 మందికి 445 మంది హాజరుతో 97.80 శాతం విద్యార్థులు హాజరైనట్లు డీఐఈవో బైరి శ్రీనివాస్ తెలిపారు. కాగా, నర్మెట లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని డీఐఈవో సందర్శించారు.

బీటీ రోడ్డు వేయాలని తండావాసుల ఆందోళన

లింగాలఘణపురం, ఫిబ్రవరి 9: మండలంలోని వనపర్తి శివారు మర్రితండాకు బీటీ రోడ్డు పనులను చేపట్టాలని స్థానికులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఆరు నెలలుగా మర్రితండాకు కంకరపోసి అసంపూర్తిగా వదిలేయడంతో నిత్యం ప్రమాదాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తండా రోడ్డు పనులను వెంటనే పూర్తి చేసి ప్రమాదాల నుంచి రక్షించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు రవినాయక్, నర్సింహ్మా, నరేందర్, సర్వే, శంకర్, చంద్రు, ప్రకాశ్, రవీందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ భవన్ ఎదుట మహిళల ధర్నా

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 9 : మాజీ ఎమ్మెల్యే రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దంటూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన పార్టీ మహిళా నాయకులు హైదరాబాద్‌లో గాంధీ భవన్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఇటీవల రాజయ్య బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగడంతో రాజయ్యను కాంగ్రెస్‌లోకి తీసుకోవద్దంటూ ఆ పార్టీ నాయకులు మండలాల వారీగా ఆందోళనలు చేశారు. కాగా, ఏడు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షుల ఆధ్వర్యంలో హైదరాబాద్ గాంధీ భవన్ వద్దకు తరలివెళ్లి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రఘునాథపల్లి ఎంపీపీ మేకల వరలక్ష్మి, మహిళా అధ్యక్షులు చింత జోత్స్న, పేర్ని ఉష, శ్రీలత రెడ్డి, యామిని, కొయ్యడ శోభ, నారగోని పద్మ తదితరులు పాల్గొన్నారు.

సైడు కాలువ పనులకు జడ్పీటీసీ శంకుస్థాపన

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 9: మండలంలోని తిమ్మంపేటలో నిర్మించనున్న సైడు కాలువల పనులకు గ్రామస్తుల సమక్షంలో శుక్రవారం జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మురుగు నీరు సక్రమంగా వెళ్లేందుకు గాను స్థానిక ప్రధాన రహదారి పక్కన గల దళిత కాలనీలో సైడు కాలువల నిర్మాణానికి రూ.4లక్షల జడ్పీ నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సారంగపాణి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, బీఆర్ఎస్ నేతలు ఇల్లందుల శ్రీనివాస్, జోగు స్వామి, విజయ్, పరమేశ్, రత్నం, సుదర్శన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జియాలజిస్టు రిపోర్టు లేకుండానే బోరుబావి తవ్వకం


వాటర్ ట్యాంక్‌ల వద్ద వేసిన బోరుబావి

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 9: డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వాటర్ ట్యాంకులు ఉన్నప్పటికి వాటి ఎదురుగానే కాంట్రాక్టర్ బోరు బావి తవ్విన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ప్రభుత్వ నిధులతో బోరుబావి వేసే క్రమంలో కాంట్రాక్టర్ జియాలజిస్టు రిపోర్టు తీసుకొని వేయాల్సి ఉంటుంది. కానీ, సదరు కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతి తీసుకోకుండానే బోరుబావి తవ్వారు. 400 అడుగులపైగా బోరు తవ్వినప్పటికి చుక్కనీరురాలేదు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా బోరుబావి వేసి ప్రభుత్వ ధనాన్ని వృథా చేయడం సరికాదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో శ్రీధర స్వామిని వివరణ కోరగా తనకు బోరు విషయంలో ఎలాంటి సంబంధం లేదని దాటవేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రజితను వివరణ కోరగా తనకు బోరు వేసే సమాచారం ఉందని, కానీ, జియాలజిస్టు రిపోర్టు తనకు కాంట్రాక్టర్ ఇవ్వలేదని తెలిపారు.

రైతులకు త్వరగా పరిహారం చెల్లించాలి : సీపీఎం

జనగామ టౌన్, ఫిబ్రవరి 9: జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు వడ్లకొండ గ్రామ రైతులతో కలిసి శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ శివలింగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ.. రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పులుతెచ్చి గతేడాది పంటలు వేస్తే ఏప్రిల్‌లో అకాల వర్షాలకు దెబ్బతిని ఆగమయ్యారన్నారు. జిల్లాలో వేల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే అప్పటి ప్రభుత్వం నయా పైసా పరిహారం ఇవ్వలేదన్నారు. తక్షణ సాయం కింద అప్పటి సీఎం కేసీఆర్ ఎకరాకు రూ.10వేలు ప్రకటించినా చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం పట్టణ కార్యదర్శి మంగ బీరయ్య, రైతులు రామ్మోహన్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, రామచక్కం సత్తయ్య, జగన్, సిద్ధయ్య, రాములు, ఎండీ.యూసుఫ్ పాల్గొన్నారు.

చురుకుగా గ్యాస్ కనెక్షన్ నంబర్ల దిద్దుబాటు

పరిశీలించిన అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్


కొడవటూరులో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

బచ్చన్నపేట, ఫిబ్రవరి 9 : మండలంలో చురుకుగా వంటగ్యాస్ కనెక్షన్ నంబర్ల దిద్దుబాటు కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ కొడవటూరు గ్రామాన్ని సందర్శించి నమోదు తీరును పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను మండల స్పెషల్ ఆఫీసర్ ఇస్మాయిల్, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణలను అడిగి తెలుసుకున్నారు. నంబర్లు తప్పుగా నమోదైన జాబితా ఆధారంగా మండలంలో ఇంటికి వెళ్లి వివరాలు తీసుకుని ఆన్‌లైన్‌లోఎంట్రీ చేస్తున్నారు. మండల పరిధిలో 5,934 గ్యాస్ కనెక్షన్‌ల నంబర్లు తప్పుగా ప్రజాపాలన దరఖాస్తుల్లో నమోదు చేశారన్నారు. ఇప్పటి వరకు సుమారు 3వేలు సరిచేయటం జరిగిందన్నారు.

● నర్మెట : గ్యాస్ వినియోగదారుల వివరాలను స్పష్టంగా సేకరించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్దండ గ్రామంలో గ్యాస్ ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి గ్యాస్ వినియోగదారుల వివరాలు సేకరించి ప్రజాపాలన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఖాజామోహినొద్దీన్, కార్యదర్శి గణేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గ్యాస్ వివరాలు నమోదు చేయాలి : ఆర్డీవో

నర్మెట : గ్యాస్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ప్రజాపాలన యాప్‌లో నమోదు చేయాలని ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. నర్మెట మండల కేంద్రంలో శుక్రవారం గ్యాస్ ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. గ్యాస్ లబ్ధిదారుల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. అదేవిధంగా పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి దామోదర్‌రావు, కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

● తరిగొప్పుల : ప్రజాపాలనలో భాగంగా వచ్చిన దరఖాస్తులను యాప్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని ఆర్డీవో మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంతో పాటు బొత్తలపర్రె, బొంతగట్టునాగారం గ్రామాల్లో శుక్రవారం పర్యటించి మహాలక్ష్మి లబ్ధిదారుల వివరాల సేకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో లబ్ధిదారులు పలు వివరాలను తప్పుగా నమోదు చేశారని, వాటన్నింటిని అధికారులు ఇంటింటా తిరుగుతూ సవరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిష్టయ్య, ఎమ్మార్ఐ రవీందర్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వస్త్ర వ్యాపారి మృతి


జహంగీర్ (ఫైల్)

జనగామ టౌన్, ఫిబ్రవరి 9 : జనగామ పట్టణానికి చెందిన ఓ వస్త్ర వ్యాపారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన మహ్మద్ జహంగీర్(38) స్థానికంగా రెండు వస్త్ర దుకాణాలు నిర్వహిస్తూ జీవనం గడుపుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లోని బెడ్ రూంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను కిందికి దింపి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది జహంగీర్‌ను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఈ ఘటనకు ముందు రోజు రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. మృతుడి సోదరుడు బురహనుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై సృజన్ తెలిపారు. ఉరి వేసుకున్న తీరుపై సందేహాలు ఉన్నందున అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు. జహంగీర్ బీఆర్ఎస్ పార్టీ 26వ వార్డు ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు.

గౌడ జన హక్కుల పోరాట సమితి
మండల అధ్యక్షుడిగా సోమయ్య

కొడకండ్ల, ఫిబ్రవరి 9 : గౌడ జన హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా దండెంపెల్లి సోమయ్యను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వర్లు తెలిపారు. కొడకండ్ల మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన సోమయ్యకు నియామక పత్రాన్ని అందజేసి మాట్లాడారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సమితి బలోపేతంలో భాగంగా అన్ని మండలాల్లో కమిటీలను నియమిస్తున్నట్లు తెలిపారు. సోమయ్య మాట్లాడుతూ తనకు మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన సమితి పెద్దలకు ధన్యవాదాలు తెలుపుతూ గౌడ కులస్తుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కమ్మగాని పరమేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్మెట శ్రీనివాస్‌గౌడ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే ఆరోగ్యం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఫిబ్రవరి 9 : స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బోనగిరి ఆరోగ్యం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. తన కుమారుడు బోనగిరి రవీందర్‌కు వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే టికెట్ కోసం పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఉంటూ పనిచేస్తున్న తమకు టికెట్ ఇవ్వాలని కోరారు.

దేవరుప్పులలో చీరల పంపిణీ

దేవరుప్పుల, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆడపడచులకు మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉప్పుల ఉప్పలయ్య, ఉప్పుల అనిల్‌కుమార్, చిలుకూరి చంద్రమౌళి, పులిగిళ్ల వెంకన్న, తోటకూరి రమేష్, ఆకుల సోమనర్సయ్య, రవి, వెంకన్న, శేఖర్, అబ్బయ్య, ప్రకాష్, శ్రీకాంత్, శ్రీను, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో ఉత్సాహంగా పనిచేయాలి

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి, ఫిబ్రవరి 9: అసెంబ్లీ ఎన్నికల్లో లాగానే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పాలకుర్తి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 48వేల మెజారిటీతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని గెలిపించిన పాలకుర్తి ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో అదే రీతిలో కష్టపడి పని చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రెండు పథకాలను అమలు చేసిందని, గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ పథకాలను అమలు చేసేందుకు చర్యలు చేపడుతుందని ఆమె తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, అనుముల మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, గడ్డం యాకసోమయ్య, మాజీ సర్పంచు మాచెర్ల పుల్లయ్య, శ్రీపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

హాజరు కానున్న 2,748 మంది అభ్యర్థులు

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 9 : ఉమ్మడి వరంగల్ జిల్లా మామునూరు నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరం 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేసింది. పరీక్ష ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు మొత్తం 2,748 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పరీక్షల సక్రమ నిర్వహణకు గాను ఆయా పరీక్ష కేంద్రాల పరిశీలకులు, సూపరింటెండెంట్‌లకు మామునూరు నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ నేతృత్వంలో ఇటీవల శిక్షణ సమావేశం నిర్వహించి పరీక్షా కేంద్రాలు, ఏర్పాట్లు, జాగ్రత్త చర్యలు, వంటి అంశాలపై పలు సూచనలతో మార్గనిర్దేశం చేశారు. పరీక్ష నిర్వహణ, సన్నద్ధతపై ప్రిన్సిపాల్ వివరాలను వెల్లడించారు.

9వ తరగతికి 5 పరీక్ష కేంద్రాలు

9వ తరగతి ప్రవేశ పరీక్షకు మొత్తం 1,404 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. వీరికి వరంగల్ నగరంలోని జడ్పీ ఉన్నత పాఠశాల-మట్వాడ, జడ్పీ ఉన్నత పాఠశాల-నరేంద్రనగర్, జడ్పీ ఉన్నత పాఠశాల-శంభునిపేట, జడ్పీ ఉన్నత పాఠశాల-కృష్ణకాలనీ, జవహర్ నవోదయ విద్యాలయం-మామునూరు మొత్తం ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష ప్రశ్నపత్రంలో మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో హిందీ, ఇంగ్లీషు భాషకు 15 మార్కుల చొప్పున, గణితం, జనరల్ సైన్స్‌కు 35 మార్కులు చొప్పున ఉంటాయి.

11వ తరగతికి 6 పరీక్ష కేంద్రాలు

11వ తరగతి ప్రవేశపరీక్షకు మొత్తం 1,344 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. వీరికి వరంగల్‌నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల-రంగశాయిపేట, ప్రభుత్వ ఉన్నత పాఠశాల-గిర్మాజీపేట, జెఎస్ఎం ఉన్నత పాఠశాల-ఉర్సుగుట్ట (వరంగల్), ప్రభుత్వ ఉన్నత పాఠశాల-కరీమాబాద్(వరంగల్), ప్రభుత్వ ఉన్నత పాఠశాల-శివనగర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల-దేశాయిపేట.. మొత్తం 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష పత్రంలో మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో మెంటల్ ఎబిలిటీ 20, ఇంగ్లీషు భాషపై 20, సైన్స్‌పై 20, సోషల్ సైన్స్‌పై20, గణితంపై 20 చొప్పున మొత్తం 100 మార్కులు ఉంటాయి.

గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి

పరీక్ష రాసే అభ్యర్థులు ఆయా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి. పరీక్షను బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నుతో మాత్రమే ఓఎంఆర్ షీట్‌లో రాయాల్సి ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఏదో ఒక దానిని గుర్తించి ఓఎంఆర్ షీట్‌లో సర్కిల్‌ను నింపాల్సి ఉంటుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ పద్ధతిలోనే ఉంటాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష రాసే అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ప్రిన్సిపాల్ పూర్ణిమ సూచించారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

జనగామ టౌన్, ఫిబ్రవరి 9 : సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ సేన జనగామ జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. 285వ జయంతి మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మ బోధనల ద్వారా గిరిజన జాతిని ధర్మ మార్గంలో నడిపించి జాగృత పరిచి ఐకమత్యాన్ని పెంపొందించిన ఘనత సేవాలాల్‌దేనని అన్నారు. ఆయన జయంతిని ప్రతీ గ్రామం పండుగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొర్ర రంగ్యానాయక్, లావుడ్యా అనిల్ చౌహాన్, రవినాయక్, అశోక్, ప్రకాశ్, నవీన్, ప్రశాంత్, రాజేందర్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించి ప్రభుత్వాలు అధికారికంగా ఉత్సవాలు నిర్వహించాలని బీఆర్ఎస్వీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవి నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆర్డీవో వాసం రాంమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న సెలవు ప్రకటించాలని అన్నారు.

గూడూరులో సుశ్రుత, దేవర్షుల వర్ధంతి

పాలకుర్తి, ఫిబ్రవరి 9: సుశ్రుత, దేవర్షులది కుల దురాహంకార హత్యలని కుల అసమానత నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ గురిమిల్ల రాజు అన్నారు. మండలంలోని గూడూరులో శుక్రవారం సుశ్రుత, దేవర్షుల ఐదో వర్ధంతి సందర్భంగా కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం ఆధ్వర్యంలో వారి సమాధుల వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, బండారి లక్ష్మయ్యలు కుటుంబ గుర్తింపు కాదు.. కుల గుర్తింపుతోనే సుశ్రుత, దేవర్షులను హత్య చేశారన్నారు. ఈ హత్యలకు వ్యతిరేకంగా ప్రజాన్యాయ పోరాటం చేసి గెలిచిన బాధితులకు అండగా ఉన్న కుల అసమానతల నిర్మూలన పోరాట సమితికి అభినందనలు తెలిపారు. 2019లో హత్య చేయపడ్డ సుశ్రుత, దేవర్షుల సమాధుల వద్ద 155 రోజులుగా రిలే దీక్షలు చేసినట్లు గుర్తు చేశారు. అట్టి సమాధులను స్మారక స్మృతి వనంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గురిమిల్ల రాజు, చక్రవర్తి, గన్నారపు సరోజన, గుమ్మడిరాజు సాంబయ్య, కందిక కోమల, సుచరణ్, మొగిలి, సైదమ్మ, ఆనంద్, ఇజ్జగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


తిమ్మంపేటలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 9: మండలంలోని తిమ్మంపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఇటీవల జనగామలో విద్యార్థులకు 9వ జూనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తిమ్మంపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన మండల శ్రీశాంత్, ధరంసోత్ రాజేందర్, జాటోత్‌అంజి, హపావత్ జీవన్, లాకావత్ దాసు (10వ తరగతి), మంద జశ్వంత్, మారపాక వివేక్, లకావత్ చరణ్, ఆడెపు నిరంజన్‌లు ఉత్తమ క్రీడా ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం ఇనుగాల ఇంద్రసేనారెడ్డి, పీఈటీ కొండ రవి తెలిపారు. ఈ నెల 10, 11 తేదీల్లో హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. కాగా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం జడ్పీటీసీ బేబీ, మాజీ సర్పంచ్ మల్లేశ్, పాఠశాల శాశ్వత క్రీడా దాత చాడ ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. మరింత పట్టుదల, నైపుణ్యంతో జాతీయ స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

● నర్మెట : రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్న కుందారపు రాహుల్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శరత్‌కుమార్ తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 10, 11న హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కాగా, విద్యార్థి రాహుల్‌ను కళాశాల అధ్యాపకులు శుక్రవారం అభినందించారు.

ఉపాధి హామీ పని కోసం దరఖాస్తు చేసుకోండి

కొడకండ్ల, ఫిబ్రవరి 9 : మండలంలో ఉపాధి హామీ పని కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో నరిగె కుమారస్వామి కోరారు. శుక్రవారం మండలంలోని పాకాల గ్రామంలో జంగిల్ క్లియరెన్స్ సైట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పని కోసం ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు అవగాహన కల్పించి అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు.

సైబర్ క్రైంపై విద్యార్థులకు అవగాహన సదస్సు

కొడకండ్ల, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలోని టీఎస్ఆర్ఎస్ విద్యార్థులకు సైబర్ క్రైంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ ఓటీపీలను, వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా బహిరంగ పరచవద్దని సూచించారు. సైబర్ బెదిరింపులు ఏమైనా ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన లింక్‌లను ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్, ఏఎస్ఐ రమేశ్, ఉపాధ్యాయులు కొమురెల్లి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

జనగామ టౌన్, ఫిబ్రవరి 9: వ్యాపారులు సకాలంలో పన్నులు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని ఇన్‌కం ట్యాక్స్ పీజేపీ లక్ష్మి, ఐటీ అధికారి ప్రమోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం జనగామలోని విజయ ఫంక్షన్ హాల్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వ్యాపారులకు ఇన్‌కం ట్యాక్స్ టీడీఎస్, టీసీఎస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యాపారులు టీడీఎస్ ట్యాక్స్‌ను సకాలంలో చెల్లిస్తే జరిమానా, వడ్డీల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. టీడీఎస్‌కు సంబంధించిన విషయాలను వ్యాపారులకు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఇన్‌కం ట్యాక్స్ ఆడిటర్ బుస్సా సిద్ధేశ్వర్‌రావు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పోకల లింగయ్య, పజ్జూరి జయహరి, ద్వారకా దాస్ బజాజ్, రామిని రాజేశ్వర్, కానుగంటి ముత్తయ్య, పెద్ది వెంకటనారాయణగౌడ్, యాంసాని శ్రీనివాస్, దోర్నాల వెంకటేశ్వర్లు, దేవరాజ్, చకినాల సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ఘనంగా హోమ పూజ


ఆలయంలో హోమపూజ జరిపిస్తున్న పూజారులు

చిలుపూర్, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం హోమపూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, పూజారి సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రాల మధ్య హోమం కాల్చడంతో పాటు, వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా చేపట్టారు. అనంతరం భక్తుల సమక్షంలో కల్యాణం జరిపించారు. ప్రత్యేక రుసుము చెల్లించి హోమపూజలో కూర్చున్న దంపతులకు స్వామి వారి శేష వస్త్రాలతో పాటు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన కోదండ బాబూరావు-పద్మావతి కుటుంబ సభ్యుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు-కిరణ్మయి దంపతులు, కృష్ణమాచార్యులు, మాజీ ధర్మకర్త సంగోజు మోహనాచారి-శంకరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేష్, రికార్డు అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ శ్రీనివాస్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

చిలుపూర్, ఫిబ్రవరి 9 : జనగామ రూరల్ (రఘునాథపల్లి) సీఐగా బాధ్యతలు చేపట్టిన ఇ.శ్రీనివాస్‌ను మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. శుక్రవారం మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు తాళ్ళపల్లి సమ్మయ్య, గడ్డమీది అశోక్ నేతృత్వంలో రఘునాథపల్లి మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐని కలిశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్య సుధాకర్‌నాయక్, మార్కెట్ డైరెక్టర్ బత్తుల రాజన్‌బాబు, గడ్డమీది వెంకటస్వామి, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి రంగు రమేష్, ఇల్లందుల హరిబాబు, తాళ్ళపల్లి శ్యామ్, విజయ్, గుంటి మల్లయ్య ప్రశాంత్, చిలుక రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 9 : మండలంలోని కూనూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పాలనా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. విద్యార్థులే పాఠశాల నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. డీఈవోగా సుప్రిత ప్రియ, ఎంఈవోగా ఐశ్వర్య, హెచ్ఎంగా అర్చన వ్యవహరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మండల నోడల్ అధికారి ఎండీ.పర్వేజ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యా లక్ష్యాలను చేరుకునేందుకు, ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. చక్కగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. హెచ్ఎం కె.సురేందర్, మహేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ సంధ్య శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కుమార్, దాతలు మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎల్లాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

పాలకుర్తి, ఫిబ్రవరి 9 : గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో ఈ నెల 10వ తేదీ నుంచి జరిగే జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు మండలంలోని చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న బాలబోయిన స్మైలిక ఎంపికైనట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తొంతమల్ల గణేష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాలోని కాసారం గ్రామంలో 6వ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచడంతో స్మైలిక జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని మహాత్మ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంటా రవీందర్ అభినందించి ఆర్థిక సహాయం అందచేశారు.

బీఆర్ఎస్ ఎంపీ సీటుపై మాచర్ల గురి

మద్దతుగా ముదిరాజ్ సంఘం లేఖ

జనగామ టౌన్, ఫిబ్రవరి 9 : పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ భువనగిరి ఎంపీ సీటు కోసం వివిధ పార్టీల నుంచి ఆశావహులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బీసీ అభ్యర్థిగా బరిలో దిగేందుకు జనగామకు చెందిన రిటైర్డ్ కర్నల్ మాచర్ల భిక్షపతి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే ఆయన పార్టీ పెద్దలను కలిసినట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పాలకుర్తి, జనగామ టికెట్లను ఆశించి భంగపడ్డ ఆయన, ఆ తరువాత కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరి పల్లా గెలుపు కోసం పనిచేశారు. భారత ఆర్మీలో కల్నల్ హోదాలో పనిచేసిన అయన ప్రస్తుతం మాజీ సైనికుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. ఇటీవల మాజీ సైనికులకు పార్టీలు సముచిత స్థానం కల్పించాలని బహిరంగ లేఖ రాశారు. మరోవైపు రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గానికి టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని పలు సభల్లో డిమాండ్ చేశారు. తాజాగా తెలంగాణ ముదిరాజ్ మహా సంఘం బీఆర్ఎస్ హైకమాండ్‌కు ఓ లేఖ రాసింది.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

బచ్చన్నపేట, ఫిబ్రవరి 9 : అధికార పార్టీకి గ్రామ స్థాయి నేతగా ఉంటే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని భావిస్తున్న నాయకులు గ్రామ అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్నారు. శుక్రవారం మండలంలోని కొన్ని గ్రామ కమిటీ ఎంపిక కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా ఆరుగురు పోటీపడి తగ్గేదే లేదంటూ భీష్మించారు. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో ఆరోపణలు సంధించుకున్నారు. పరిస్థితి చేయి దాటిపోతుందని గ్రహించిన సమన్వయ కమిటీ నేతలు వాయిదా వేసి వెళ్లిపోయారు. అలాగే రాంచంద్రాపూర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా నర్మెట అంజనేయులు, వేములవాడ చంద్రమౌళి, యూత్ అధ్యక్షుడిగా నాచగోని అజయ్, దబకుంటపల్లి అధ్యక్ష, కార్యదర్శులుగా రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి, అనుప నర్సింహులు, యూత్ అధ్యక్షుడిగా అనుప నరేష్, మహిళా అధ్యక్షురాలిగా నల్లగోని కవితలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కమిటీల ఎన్నికల సమావేశాలకు హాజరైన సమన్వయ కమిటీ నాయకులు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కమిటీల నియామకం జరుగుతుందన్నారు. కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నేతలు నిడిగొండ శ్రీనివాస్, వంచ వెంకటరెడ్డి, నల్లగోని బాలకిషన్‌గౌడ్, జిల్లెల్ల దయాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మసూద్, జంగిటి నరేష్, బండకింది హరిబాబుగౌడ్, వేణు వందన, నూకల బాల్‌రెడ్డి, జ్యోతి భాస్కర్, రామిని మదన్, ఆముదాల మల్లారెడ్డి, బందారం క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.